

కథ 2002
13

# ఆవు-పులి మరికొన్ని కథలు

డా॥ వి. చంద్రశేఖరరావు

ఈ మార్పులు మొదలై చాలాకాలం అయుంటుంది. నా ఎరుకలోకి వచ్చింది ఈమధ్యనే. గాలిలో, నేలలో, వాతావరణంలో ముందుగా మార్పులు వచ్చాయి. రోడ్డుపై నడుస్తుంటే మన పైకి వేడిగాలులు వదులుతున్నట్లుగా ఉంటుంది.

పేవ్‌మెంట్లు, సిమెంట్ గోడలు పగుళ్లు వారటం, చెట్లపై ఆకులు అదృశ్యం కావటం, మనుషుల చుట్టూ తెల్లనిపొర ఏదో కమ్మినట్లు, గాలిలోని ఇసుక రేణువులో, ఫ్యాక్టరీల కాలుష్యమో, వాహనాల పొగో స్పష్టంగా తెలియదు కానీ, రోడ్డుపై వెళుతుంటే తెరల్ని చీల్చుకొని ప్రయాణిస్తున్నట్లుగా ఉంటుంది.

జనమంతా వాతావరణంలోని మార్పుల గురించి భయపడుతుంటే, నేను అదృశ్యమవుతున్న పచ్చదనం గురించి, జంతువుల గురించి భయపడుతున్నాను. ఎటు చూసినా మనిషి వాసనలు, మనిషి రూపాలు. ఎంత గాఢంగా పులిమినా ఈ మనిషి రంగు, భూమిపైని వేడిని, మార్పుల్ని ఆపగలదా?

సాయంకాలం ఆరు కాగానే సగం సగం పెయింట్ చేసిన స్కెచ్‌లు, రంగులు, బ్రష్‌లూ హ్యాండ్ బ్యాగ్‌లో కుక్కుకొని బయటపడ్డాను. తెల్ల మారుతీ కారు, వినయంగా నిలబడ్డ డ్రైవరూ వద్దని చెప్పి రోడ్డు పక్కనే నడవటం మొదలుపెట్టాను. ఫ్లై ఓవర్ కింద కొత్తగా వేసిన మినీ గార్డెన్ దగ్గర ఆగాను. స్కూల్ కుర్రాడొకడు పూలమొక్కల పైకి వంగి, దాని వాసనని గాఢంగా పీల్చటం మొదలుపెట్టాడు. పచ్చని గడ్డిపైన కూలబడ్డ వృద్ధుల జంట పచ్చికను ఆప్యాయంగా తడుముతున్నారు. ఇనుపకంచెలోంచి మూతిని లోపలికి పెట్టి ఒక ఆవు గాఢంగా శ్వాసిస్తోంది. తినడానికి వీలులేకుండా ఇనుప కంచె. అందుకే అది ఆ పచ్చికలోని తీపినో, వాసననో గాఢంగా పీల్చుతోంది. ముక్కుపుటాలు తెరచి 'హిస్'మంటూ శబ్దం చేస్తోంది. వాసనలు ఆఘ్రాణించే శక్తి నాలోనూ అనూహ్యంగా పెరగటం తెలుస్తోంది. పూలచెట్లు కనిపిస్తూనే నా ముక్కుపుటాల్లో సంచలనం కలుగుతోంది. పరిమళం ఉప్పెనలా నన్ను చుట్టుముడుతోంది. వసంతాల నుంచి, వందలాది ఎకరాల పూలతోటల నుంచి పరిమళమంతా ఎగసి వచ్చినట్లుగా, రోడ్డు పక్కన ఏ మొక్క కనిపించినా అది పరిమళ రంధ్రాలన్నీ తెరచుకొని నా కోసం ఎదురుచూస్తున్నట్లుగా అనిపించటం, ఇవి కూడా నాలో కొత్తగా తోసుకొస్తున్న మార్పుల్లో భాగమే.

ఇంటిదగ్గర ఈ సమయానికి ఒక పార్టీ జరుగుతూ ఉంటుంది. వారంరోజులుగా మనోహర్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. 'వ్యవసాయ కార్మికులు-గ్లోబలైజేషన్ ప్రభావం' అనే విషయంపై ఒక జాతీయ సెమినార్ నిర్వహించడానికి అనుమతి వచ్చింది. విదేశాల నుంచి అవసరమైన ఫండ్స్ కూడా అందాయి. నిర్ణయాత్మకమైన సెమినార్‌గా దీన్ని తీర్చిదిద్దాలని మనోహర్ ఆరాటం. చట్టసభల నుంచి ఎం.పిలను, సివిల్ సర్వీసుల నుంచి ఐ.ఎ.ఎస్‌లను కూడా ఆహ్వానించాలని, అవసరమైతే అసెంబ్లీకి ఊరేగింపు తీయాలని తన ప్రయత్నం.

ఇంటి ముందున్న లాన్‌లో కమ్మని సంగీతం, తీయని రుచులు, మృదువైన సంభాషణలు. హడావిడి అంతా తెలుస్తోంది. రచయితలు, కవులు, సోషల్

సర్వీస్ సంస్థలవాళ్లు. కొత్తగా వస్తున్న మార్పుల్లో ఈ పార్టీలు కూడా ఒక భాగమే. ఇప్పుడు ఉద్యమాలు, ప్రజాజీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు ఇట్లాంటి పార్టీల మధ్యే నిర్మాణం అవుతున్నాయి. ఇంట్లోకి వస్తుంటే కనీసం పాతిక పైగా చేతులు హలోలు చెప్పాయి. వాళ్ల నిర్ణయాత్మకమైన ఏకాంతాన్ని భంగం చెయ్యటం ఇష్టంలేక చిరునవ్వులు విసిరి లోపలికి వచ్చాను. లోపలికి నడుస్తుంటే, "మువ్వకు జ్వరం. నీకోసం అడుగుతోంది," అన్నాడు మనోహర్.

పై గదిలోకి వెళుతుంటే మెట్ల పక్కన పొడవాటి అద్దంలో వింతరూపం కనబడి ఉలిక్కిపడ్డాను. చేతులపై, మెడపై పొలుసులు పొలుసులుగా జంతుచర్మం ఏదో మొలుచుకొస్తున్నట్లుగా తోచి కంగారుపడ్డాను. దగ్గరకు వెళ్లి మళ్లీ చూసుకొన్నాను. ఏదో భ్రమ. నిజం అనిపించేంత భ్రమ.

గదిలో మంచంపై ముడుక్కొని పడుకొంది మువ్వ. నావైపు చూసి నీరసంగా నవ్వింది. కళ్లలో ఎర్ర జీరలు. ముఖం ఉబ్బి ఉంది. కళ్లను నావైపు తిప్పి, "నువ్వు వచ్చినట్లు ఇప్పుడే కల వచ్చింది," అంది నవ్వుతూ. ఇంకా నిద్రలోనే ఉన్నట్లుంది. శరీరం చుట్టూ వెచ్చని ఆవిర్లు, జ్వరం వాసన. పక్కకు తిరిగి ఒత్తిగిలి, "కథ ఒకటి చెప్పు" అంది. మువ్వకు మృగాల గురించి, జంతు ప్రపంచం గురించిన కథలంటే ఇష్టం. తన కోసం కొత్త జంతువుల్ని, కొత్త కొత్త కథల్ని సృష్టిస్తుంటాను. మందు వేసినాక సగం మనిషి, సగం ఖడ్గమృగంగా మారిన రాజకుమారుడి కథ చెబుతుండగా నిద్రలోకి జారుకొంది.

రాత్రి పదిగంటలకు మనోహర్ పైకి వచ్చాడు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు. ఎవరెవరిని ఆహ్వానిస్తున్నదీ, ఎంతమంది వస్తున్నదీ అన్ని విశేషాలు చెబుతూనే ఉన్నాడు. అన్నం తింటున్నప్పుడు, టీవీలో వార్తలు చూస్తున్నప్పుడు, చివరకు పక్కమీద ఏకాంతపు దగ్గరితనంలో కూడా ఆ విశేషాలే. "పత్రికలలో యాడ్‌లు, పోస్టర్‌ల ప్రింటింగ్, కరపత్రాలు, బుక్‌లెట్స్ ప్రింట్ చెయ్యటం అన్నీ మన యాడ్‌ఏజన్సీకే ఇస్తున్నాం. రిచ్‌గా ఉండాలి. మీటింగ్ స్థలం రవీంద్రభారతి దగ్గర నలభై అడుగుల హోర్డింగ్ కూడా ప్లాన్ చేస్తున్నాం," అన్నాడు. తన రెండు చేతులూ నా భుజాల మీదుగా వెనక్కు జారి శరీరం మొత్తాన్ని అదుముకొంటున్నాయి. పొడవాటి అతని జుట్టు చెల్లాచెదరై, అందులోంచి షాంపూ వాసన, స్ప్రే వాసన మత్తుతెరలా ఎగసి వస్తున్నాయి. "బెంగాలీ డైరెక్టర్ రితూ ఒక డాక్యుమెంటరీని చేస్తానంటోంది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో గ్రామాలలో వచ్చిన కరవు, ఆకలి చావులపై చిత్రం అది. స్క్రిప్ట్ అంతా నేనే..." మెల్లగా ముందుకు జరిగి పెదాలతో అతని పెదాలపై వత్తాను, అతను తన ధోరణిని ఆపాలని. అతను క్షణంపాటు ఉక్కిరిబిక్కిరి అయి, రెండు చేతుల్తో నన్ను పక్కకు తోసి, "నీలో ఏదో మార్పు. నీ పెదాలు బండగా జంతువుల పెదాల్లా, శరీరం కూడా అడవి జంతువుల చర్మంలా- మొత్తంగా నీలో ఏదో మార్పు వస్తోంది. కాఫ్కా కథల్లోలాగా నువ్వో జంతువుగా మెటామార్ఫసిస్ అవుతున్నావేమో అనిపిస్తోంది," అన్నాడు సీరియస్‌గా. అంతలోనే దగ్గరకు లాక్కొని, "ఇట్లా జంతువులాగా మొరటుగా ఉండటం కూడా నాకు ఇష్టంగా ఉంది. హింసలాంటి ప్రక్రియ జరిగితే గానీ హాయి రగలటం లేదు. మృదువైన శృంగారాల కాలం కాదిది," అన్నాడు గాఢమైన శృంగార క్రీడకు నాంది పలుకుతూ.

గది బయట అలికిడి అయింది. మువ్వ. ఇంకా నిద్రలోనే ఉన్నట్లుంది. కలలోంచే మాట్లాడుతున్నట్లుగా 'మమ్మీ రా, రెక్కల గుర్రాలు, సీతాకోక చిలుకలు' అంటూ నిద్రలోనే కలవరిస్తోంది. "నువ్వెళ్లు. పాపని నిద్రపుచ్చి రా," అంటూ ముందుకు తోశాడు మనోహర్.

*

చిన్నచిన్న పల్లెటూర్లు నా కలలు. పల్లెల స్పర్శలే నా రంగులు, చిత్ర రచనలు. పల్లె నుంచి తెంచుకొచ్చిన పేగుముక్కనే అందమైన బొమ్మలుగా మారుస్తున్నాను. బొమ్మల్ని మోసుకొని ఇల్లిల్లూ తిరిగే రోజుల్లో మనోహర్ వాటిని పరిశ్రమగా చేశాడు. ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేసి, హిందూలో రివ్యూలు రాయించి, హఠాత్తుగా నెలల వ్యవధిలోనే ప్రముఖ చిత్రకారిణిని చేశాడు. ఆ దశలోనూ పల్లెల కలలే నావి. యాడ్ ఏజన్సీ మొదలు పెట్టినాక క్రమంగా కాంక్రీటు భవనాలు, ఇనుప దిమ్మెలు, ఖాళీస్థలాలు నా కలల్లోకి రావటం మొదలు పెట్టాయి. ఇప్పుడు పల్లెల దృశ్యాలు నా చేతిలో ఇమడటం లేదు. ఫ్రెంచ్ సెంటు, అమెరికన్ బ్రా, సెల్‌ఫోన్ ఇవే నా బొమ్మలకు ముడిపదార్థాలు.

ఉదయాన్నే నా టేబుల్ చుట్టూ వందలాది ఐడియాలు, భావజాలాలు, కుప్పబోశాడు మనోహర్. కరువు కథలు, ఆకలి చావులు, వందలకొద్దీ ఫోటోలు, వార్తా కథనాలు. వాటిని ముట్టు కొంటే మరణపు వాసన, దుఃఖపు వాసన. వీటన్నిటినీ పోస్టర్లుగా, హోర్డింగ్స్‌గా, కరపత్రాలుగా అనువదించాలి. ముట్టుకోవడానికి భయం వేసింది. ఇవేం పట్టించుకోవటం లేదు మనోహర్. ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. ''రవీంద్రభారతి దగ్గర హోర్డింగ్ నువ్వే వెయ్యాలి. పగలయితే గొడవ గొడవగా ఉంటుంది. రాత్రిపూట ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయిస్తాను. అద్భుతమైన బొమ్మని సృష్టించాలి. మొత్తం మీడియా అంతా వస్తున్నారు. బి.బి.సి కూడా.'' మనోహర్ రెండు మనోహర్‌లుగా, కాదు చాలామంది మనోహర్‌లుగా, ఏ మనోహర్‌లో తన స్పర్శను దాచి ఉంచాడో, ఎట్లా తెలుసుకోవాలో అర్థం కాలేదు.

మువ్వ వచ్చింది పాలు తాగుతూ. జ్వరం, బద్ధకంతో అపురూపమైన పక్షిలా నడచుకొంటూ వచ్చింది. రెండు చేతుల్ని మెడచుట్టూ వేసి, నుదుటిపై ముద్దు పెట్టుకొంది. నాలో ఉప్పెనలా ఉద్వేగం. ''రాత్రి హిప్పోలా మారిన రాజకుమారుడి గురించి సగమే చెప్పేవు. అతనికేమయింది. పులిరూపంలో ఉన్న మాంత్రికుణ్ణి చంపాడా,'' అంది చెవిలో గుసగుసగా. ''రాత్రికి చెబుతా,''నంటూ దుర్భరమైన కరువులోకి ప్రవేశించాను. లఘుచిత్రాలుగా, యాడ్‌లుగా వాటిని అనువదించడానికి.

*

రాత్రి నగరమంతా తెల్లని గాజుపొరల్లో చుట్టినట్లు మంచో, దుమ్మో, కాలుష్యమో తెలియటం లేదు. గాలి, వేడి అలలాగా దూసుకొచ్చి కాసేపటికి మరణిస్తోంది. ఆ వేడికి శరీరం ఉడికిపోతోంది. ఎక్కడినుంచైనా కాస్త చల్లనిస్పర్శ తగిలితే బాగుండుననిపిస్తోంది. గాలిలో ఎగిరే ఆ కాసిని పక్షులూ గాలికి అంటుకొని అటూ ఇటూ ఊగుతున్నట్లుగా ఉన్నాయి.

రవీంద్రభారతి చుట్టుపక్కల ఎంతో హడావిడిగా ఉంది. తలల చుట్టూ గుడ్డలు చుట్టుకొని వేడిగాలులు చెవికి తగలకుండా జాగ్రత్తపడుతూ వందకు పైగా కూలీలు కటౌట్లు కట్టడానికి, గుంతలు తవ్వడానికి, బ్యానర్లు కడుతూ, లారీల్లో పూలకుండీలు తెచ్చి ఆవరణలో తాత్కాలిక వనాల్ని సృష్టిస్తూ, ఎక్కడెక్కడినుంచో సేకరించిన పూలగుట్టలతో వేదికను అలంకరిస్తూ ఎర్రని కార్పెట్లు పరుస్తూ సభకు అవసరమైన ఉద్వేగాన్ని సమకూర్చే వనరులన్నీ సృజిస్తున్నారు. బ్రహ్మాండమైన హోర్డింగ్. నలభై అడుగుల ఎత్తు. చుట్టూ బొంగులతో పరంజాలను కట్టుకొని ఇరవైమంది వేస్తున్న చిత్రం. వారంరోజులకు ఒక రూపానికి వచ్చింది. తెగిపడిన నాలుకలు, నడుస్తున్న నాలుకలు, పాల నురగలాంటి నాలుకలు, తగలబడుతున్న అడవుల్లాంటి నాలుకలు, రక్తం కారుతున్న నాలుకలు, మరణ ముద్రలాంటి నాలుకలు- హోర్డింగ్ పొడవునా నాలుకలే. అద్భుతమైన రంగుల్లో, ఆక్రోశిస్తున్నట్లు, రోదిస్తున్నట్లు- వాటిమధ్య ఒక గ్రామీణ స్త్రీ పోరాట సూచికలా ముందుకు నడుస్తున్నట్లు.

రాత్రి రెండు దాటిన తరువాత కూలీలందరూ పనులు ముగించుకొని ఒక్కొక్కళ్లే వెళ్లిపోవటం మొదలుపెట్టారు. హోర్డింగ్ కూడా ఒక రూపానికి వచ్చింది. రంగులు వేసే కుర్రవాళ్లు వెళ్లిపోతున్నారు. రాత్రి మళ్లీ నిశ్శబ్దంగా, ఒంటరిగా అయింది. హోర్డింగ్ పైనున్న నాలుకలకు జీవం వచ్చి, కోరస్‌లాంటి చప్పుడు చేస్తున్నట్లు తోచి ఉలిక్కిపడ్డాను. చప్పుడు గేటు దగ్గర. మూడు లారీల్లో వందలాదిగా వ్యవసాయ కూలీలు బిలబిలమంటూ ఆవరణలో మూగారు. వాచ్‌మెన్ వాళ్లతో గొడవలు పడుతున్నాడు. రేపటి మీటింగ్‌కి వచ్చిన వాళ్లమని వాళ్లు వివరిస్తున్నారు. పై నుంచి నేనూ అరిచాను. వాళ్లను లోపలికి పంపమని. ఆర్డర్స్ లేవని, ఏర్పాట్లు పాడు చేస్తారని వాళ్లను లోపలకు రానివ్వటం కుదరదంటున్నాడు. వాళ్లు కాసేపు వాదించి, విసుక్కొని రోడ్డుపై నున్న పొడవాటి పేవ్‌మెంట్ పైకి చేరారు. అంతట్నీ మరిచిపోయి కబుర్లు, కేకలు, పాటలు, చప్పుడూ చేస్తూ మెల్లగా నిద్రగా మారిపోయారు.

మళ్లీ నిశ్శబ్దం, చీకటి. హోర్డింగ్ పని ఇంకా మిగిలి ఉంది. సెమినార్ సారాంశాన్నీ ఒక్క వాక్యంలో రాయాలి. 'జీవితం నిత్యమూ, నిరంతరమూ' అంటూ పెద్ద అక్షరాలలో రాయటం మొదలుపెట్టాను. రాత్రి గడిచేకొద్దీ శరీరం బరువుగా, లోపల వింత రసాయనిక చర్యలేవో జరుగుతున్నట్లు అనిపించసాగింది. శరీరం బరువుకు పరంజా ఊగిపోతోంది. కిందనున్న ఇద్దరు కుర్రాళ్లు ''మేడమ్! జాగ్రత్త,'' అని అరుస్తున్నారు. ఫరవాలేదంటూ వాళ్లవైపు సైగ చేశాను.

కానీ, శరీర మార్పులు తెలుస్తూనే ఉన్నాయి. చర్మంపై పొలుసులు పొలుసులుగా, జంతువు చర్మ మేదో లోపలి నుంచి పుట్టుకొస్తున్నట్లుగా చేతులకు వింత శక్తి, అద్భుతమైన ఒడుపు. టార్జాన్‌లా ఎగరగలిగే శక్తి. పక్కనున్న చెట్లవైపు ఎగిరి, అటు నుంచి అసెంబ్లీ భవనం వైపు ఎగిరి, పక్కనున్న గార్డెన్స్‌లోకి దూకి, అక్కడ నీటితడిని, మొక్కల పరిమళాన్ని ఆస్వాదించి, కొత్తగా ఉంది ఈ అనుభవం. తెల్లవారుజాము నాలుగు గంట లకు మళ్లీ రవీంద్రభారతి దగ్గరకు చేరాను. అక్కడ మళ్లీ సందడి మొదలైంది, పూలతొట్లు, కార్పెట్లు సర్దుతూ. ఆ హడావిడిలో మనోహర్ కూడా వచ్చాడు. హోర్డింగ్‌ని చూసి అబ్బురపడ్డాడు. దగ్గరకు వెళ్లి నా శరీరంలో వచ్చిన మార్పుల గురించి చెప్పాలని ప్రయత్నించాను. ''చేతులపై అదేమిటి పొలుసుల్లా, ఏ స్కిన్ స్పెషలిస్టు కైనా చూపించుకోవచ్చు కదా! వడలిపోయిన ముసలి ఆవుచర్మంలా, రేపు మీటింగ్‌లో ఎట్లా,'' అని విసుక్కొ న్నాడు. ''పొడవాటి జాకెట్టు వేసుకొని, నిండా షాల్ కప్పుకొని...'' సలహాలిస్తూ లోపలకు వెళ్లాడు. బయట నిద్రిస్తున్న పల్లె జనం గురించి చెప్పాను. ''ఇప్పుడు అదేమైనా అంత ముఖ్యమైన విషయమా?'' నొసలు చిట్లించాడు. బయట నగరం నిద్రలేచి తనదైన హింసా త్మక శబ్దాలను వినిపించసాగింది.

*

అట్టహాసంగా మొదలైంది సెమినార్. సుదీర్ఘ మైన ఎజెండా. ఆడిటోరియం ఉద్వేగభరితంగా ఉంది. ఎక్కడ చూసినా మనోహర్. నల్లని సూటు, నీలంరంగు టై, పెదాలపై సన్నని చిరునవ్వు (నవ్వినప్పుడు తళు క్కున మెరిసే విరిగిన పన్ను), అతని దృష్టంతా విదేశీ డెలిగేట్లపైనే ఉంది. సుదీర్ఘమైన చర్చల మధ్య నుంచి లేచి బయటకు వచ్చాను. మువ్వ కూడా నన్ను అనుస రించింది. బయట రవీంద్రభారతి మెట్లపై కూల బడ్డాను.

సిటీకి ఈ సెమినార్ గురించిన స్పృహ ఏమీ ఉన్నట్లులేదు. వాహనాలు, మనుషులూ తమదైన వేగంతో, హడావిడితో పరిగెడుతూనే ఉన్నారు. పల్లెల నుంచి వచ్చిన జనం లోపలి విషయాలేమీ అర్థంకాక బయటకు వచ్చి కూర్చున్నారు. వాళ్లలోంచి కొంతమంది ఆడవాళ్లు కమ్మటి పాటలాగా మారారు. మువ్వ వాళ్ల వైపు ఆసక్తిగా చూస్తోంది. హఠాత్తుగా మువ్వ నావైపు తిరిగి ''కథ చెప్పు మమ్మీ,'' అంది. ''విసుగ్గా ఉంది. బోరుగా ఉంది,'' అంది గోముగా. చాలాసేపు ఆలో చించి, ''తెలిసిన కథే. మళ్లీ చెబుతాను. ఆవు-పులి కథ,'' అన్నాను. ఇష్టంగా నావైపు తిరిగి కూర్చుంది మువ్వ. పల్లె స్త్రీల పాట నేపథ్యంగా కథను చెప్పటం మొదలు పెట్టాను.

*

గొడ్లచావిడి అందమైన ప్రదేశం. అక్కడ ఆవుల పాలు పితుకుతారు. గొడ్లచావిడికి తలుపులూ, గోడలూ లేవు. నాలుగైదు బొంగులు, ఎండిన రెల్లుగడ్డి, అమ్మ పొద్దున్నే లేచి పాలు పితికి, పితికిన వెచ్చని పాలను కుండల్లోంచి, గిన్నెల్లోంచి తెల్లటి పాలక్యాన్‌లోకి నింపు తుంది. తెల్లగా మిసమిసలాడే పాలు. బయట హారన్ మోగుతుంటుంది. సొసైటీవాళ్ల వ్యాను వీధి మొదట్లో పాల రాక్షసుడిలా నిలబడి ఉంటుంది. వెచ్చటి పాలకు వింతైన వాసన. శరీరం వాసన. అమ్మ ఒళ్లో కూర్చు న్నప్పుడు వచ్చే వాసన. గొడ్ల చావిడికి కాస్త దూరంలో పదహారో, ఇరవయ్యో తాటాకులతో కప్పిన కొట్టం. దానికి గోడలుంటాయి గానీ, కిటికీలుండవు. కొట్టం అమ్మలాగే అందమైన ప్రదేశం. కొట్టాలకవతల పొలాలు. పొలాలకు తూర్పుదిక్కున కొండ. కొండ పొడవునా పచ్చగా మిలమిలలాడే గడ్డి. కొండ కిందే విశాలమైన చెరువు. రోజూ సాయంకాలం ఆవుల్ని చెరువువైపుకు తోలుకెళ్తుంది అమ్మ. స్నానం చేయించ డానికి. తలకు గుడ్డ చుట్టుకొని, కర్రతో ఆవుల్ని అదిలిస్తూ నేనూ వెళతాను అమ్మతో కలిసి. ''ఏహేయ్! హేయ్,'' అంటూ వాటిని అదిలిస్తూ. గమ్మత్తుగా ఉంటాయి ఆ అరుపులు. ''నీ తల్లి సిగ్గొయ్యా,'' అంటుంది అమ్మ. అర్థంకాని తిట్టు (తల్లి సిగే ఎందుకు కొయ్యాలి అని నా సందేహం). నోళ్లలోంచి సొంగ కారు తుండగా ఎర్రటి నాలుకల్ని బయటకు పెట్టి, మోకాళ్లపై కూర్చుని నీళ్లలోకి జారి, చల్లని శీతాకాలపు నీళ్లలోని సుఖాన్ని పొందేటప్పుడు ఆవుల్ని చూడటం గొప్ప అనుభవం. పక్క పొలాల నుంచి కూడా ఆవులు వచ్చి చేరతాయి. తెల్లటివి, ఎర్రడాలువి, నల్ల పొడలవి. అమ్మ గుడిలా ఎత్తయిన జెర్సీ ఆవులు అన్నీ నీళ్లలో నానుతూ భగవంతుడు గీసిన లాండ్‌స్కేప్ చిత్రంలా కనిపిస్తాయి. సాయంకాలానికి వాటిని లేపి, అదిలించి, కర్రలతో పొడిచి (నీళ్లను వదిలి రామని మొరాయిస్తాయి), బద్ధకంగా కదులుతాయి.

చావిడిలో వాటికోసం ఉలవలు, తెలకపిండి, తౌడు కలిసిన పెద్దపెద్ద గిన్నెలు. ఆవురావురు మంటూ వాటిపైకి ఎగబడతాయి. తింటుండగానే వాటి మెడలకు పలుపుతాళ్లు బిగుస్తాయి. అవి కోపంతో గింజు కుంటాయి. కొండ, చెరువు, చల్లని నీళ్లు అంతా మోసం అన్నట్లుగా చూస్తాయి. కాసేపటికి కుడితి కూడా వస్తుంది. కుడితి తాగాక వాటికొక రకమైన మత్తు ఆవహిస్తుంది. బరువైన పొట్టలతో నేలపై అటూ ఇటూ కదులుతూ బద్ధకమో, వ్యాయామమో, అమ్మ వాటి పక్కనే నిలబడి, వాటి శరీరాలకు అంటిన మట్టిని, బురదను కడుగుతుంది.

అమ్మ చెయ్యి గాయాల్ని మాన్పే మంత్రదండం లా మారిపోతుంది. కడగటం అయిపోయినాక అవి నేలపైకి వాలిపోతాయి. నిద్రలాంటి మత్తు అది. ఇప్పుడు అమ్మ గురించి కూడా చెప్తాను. ఆ పది ఆవులకు సేవ చేసే (ఆవుల్ని సాకే) కూలీ అమ్మ. ఆవులను చూసు కొంటూ, మేత వేస్తూ, కుడితి పెడుతూ, ఖాళీగా ఉండే ఆ ప్రదేశం అంతా ఊడ్చి, పేడతో అలికి, రోజంతా శ్రమిస్తూనే ఉంటుంది (అయిదు బస్తాల వడ్లు, ఏడొందలు రొక్కం ఏడాదికి).

అమ్మ కళ్లలో అద్భుతమైన శక్తి ఏదో ఉందని నా నమ్మకం. అప్పుడప్పుడు వెన్నెల రాత్రుల్లో అమ్మ ఆవులా మారిపోయి, నాజూగ్గా నడుచుకొంటూ చావిడి లోకి వెళుతుంది. మళ్లీ రహస్యంగా ఇంటిలోకి వచ్చి ఎప్పటిలాగా అమ్మలాగా మారిపోతుంది. అప్పుడప్పుడు అమ్మ శరీరంపై గాయాలు, రక్తం. ఆ దెబ్బలెట్లా వచ్చాయో అర్థంకాదు. ఆ గాయాల్ని అలా ముట్టుకొని, అమ్మ గుండెలకు హత్తుకొని పెద్దగా ఏడుస్తాను. నాయన పొలానికి పోయి ఏ రాత్రివేళో వస్తాడు.

ఒకరోజు చావిడిలోని బొల్లి ఆవు కనబడకుండా పోయింది. అమ్మ ఊరంతా వెతికింది. పొలాలు, దొడ్లు, బందెల దొడ్లు, కొండ, చెరువు అన్నీ వెతికింది. రాత్ర యినా బొల్లి ఆవు ఇంటికి రాలేదు. అమ్మ ఆ రాత్రి అన్నం తినలేదు. రెండోరోజు కూడా ఆవు ఇంటికి రాలేదు. రాత్రంతా అమ్మ బయటే నిలబడి ఉంది ఎక్కడ నుంచైనా మువ్వల శబ్దం, గిట్టల చప్పుడు విన్పి స్తాయేమోనని. మూడోరోజు కూడా ఆవు కనబడలేదు.

మూడోరోజు సాయంత్రం ఆసామి (ఆవుల యజమాని) అమ్మకు కబురు చేశాడు. (ఆశ్చర్యం! ఆవు కనబడనందుకు ఆయన ముఖంలో దిగులు కనబడ లేదు). ఆవుకింతని లెక్క కదా అని చెప్పి, ఒక ఆవు పోయినందుకు జీతంలోంచి పదోవంతు తగ్గించాడు. వెళ్లేటప్పుడు వెనక్కు పిలిచి, కొండల దగ్గర పులి ఒకటి చేరిందట, కాస్త పదిలం, అని జాగ్రత్త కూడ చెప్పాడు.

నెల తిరిగిందో లేదో రెండో ఆవు కూడా మాయ మైంది. ఈసారి కర్రావు మాయమైంది. ఆసామి మళ్లీ అమ్మని పిలిచి జీతంలో కోత పెడుతున్నానని చెప్పాడు. వారం తిరిగేసరికి ఇంకో ఆవు. ఊరంతా పులి గురించి పుకార్లు. మనిషంత ఎత్తు పులని, పంజా విసిరితే ఎంత పెద్ద ఎనుము అయినా దెబ్బతో సఫా అని. నెల చివరన మిగిలిన అయిదు ఆవులు ఒక్కసారి మాయమైనాయి. ఆసామి అమ్మని పిలిచి, ఆవులే పోయినాక నువ్వెం దుకు, నీ మొగుడెందుకు, పనులు మానేసి ఇళ్లకు పొండి అన్నాడు. కొట్టం కూడా ఖాళీ చెయ్యమన్నాడు.

ఉన్న సామాన్లు సర్దుకొని అమ్మ, నేను, నాయన కొట్టాల్ని ఖాళీ చేశాం. నాయాల్ది పులిని నరికేస్తానని నాయన కొడవలి తీశాడు. "సాల్లే. ఇంత పెద్ద మొగోడు లేడని!" అమ్మ వారించింది. సామాన్లు నెత్తిన పెట్టుకొని పొలాల మధ్య నుండి నడుస్తున్నాం. శరీరం అలసి పోయి, వంగిపోయి ముసిల్దానిలా అయిపోయింది అమ్మ. చెరువు, కొండ ఎప్పటిలాగే చూశాయి పలక రింపుగా. చెరువులోని నీళ్లు కూడా పలకరించాయి.

దూరంగా కొండ కింద చారలు చారలుగా, ఎత్తుగా "అమ్మో పులే!" అని అరిచాను అటువైపు చూసి. నాయన చాలాసేపు అటువైపు చూసి, గబగబా నెత్తిపైన మూటను దించి, గోతంలోంచి కొడవలి బయటకు లాగి అటువైపు పరిగెత్తాడు. "ఏందయ్యా ఇది. పిచ్చేమన్నా పట్టిందా," అంటూ అమ్మ కూడా నాయన వెనకాలే వేగంగా పరిగెత్తింది.

కొండ మొదట్లో చెట్టు పక్కన నిలబడి తెల్లటి పులి. మనిషి ఎత్తుంది. ఒయ్యారంగా నిలబడింది. దాని పక్కనే ఎముకల గుట్టలు. ఇంకో పక్క ఆవు చర్మాలు (తోళ్లు).

పులి నాయన్ని చూసి సన్నగా నవ్వింది. "దించు దించు కొడవలి" అంది. నాయనకు నోటమ్మట మాట రాలేదు పులులు మాట్లాడడమేందని. "నేను మీరు చిన్నప్పుడు విన్న కథల్లోని పులిని కాదు. అన్యాయంగా ఆవుల మీద పడి చంపుకు తినేదాన్ని కాదు. న్యాయం, ప్రజాస్వామ్యం తెలిసినదాన్ని. ఆవుకు అయిదు వేలని

ఇస్తున్నాను'' అంటూ పాదంతో ఒక గోనె సంచిని ముందుకు తోసింది. అందులోంచి నోట్ల కట్టలు.

నాయన భయం భయంగా నోరు తెరిచాడు. ''మేం ఆవుల్ని సాకేటోల్లం. కూలీలం. ఆవులు పోయి నాక పనులూ పోయినాయి,'' అన్నాడు.

''ఆవుల్ని తెండి! లేకపోతే గేదెల్ని, లేదంటే మేకల్ని అవి లేకపోతే మనుషుల్నయినా తెండి. దేనికయినా అయిదువేలు!'' అని కాస్త క్రూరంగా గర్జించి, ''ఇంక పొండి! నేను విశ్రాంతి తీసుకోవాలి'' అంది. నాయన, నాయన వెంట అమ్మ, నేను వెనక్కు తిరిగాం. కొండ కింద పులి, దాని పక్కన ఆవు చర్మాలూ తెల్లగా మిల మిలలాడుతున్నాయి.

*

మువ్వ, నేనూ అట్లా కథలు చెప్పుకొంటూనే వున్నాం. మువ్వ నాకో చేప కథ చెప్పింది. పొలుసులన్నీ ఊడిపోయి నేలపైకి వచ్చి నడవటం నేర్చుకొన్న చేప. ''ఆ చేప ఇప్పుడు నా పొట్టలో ఉంది,'' అంది మువ్వ సీరియస్‌గా నావైపు చూస్తూ.

బయట ఎప్పటిలాగే వేడిగాలి, జుయ్ జుయ్ అని చప్పుడు చేస్తూ. ఇద్దరం మినీ ఆడిటోరియం దగ్గర పూలచెట్ల వైపు నడిచాం. ''ఇక్కడ కూర్చుందాం,'' అంటూ ముందుకు లాగింది. రవీంద్రభారతి ముందు పల్లెజనం నేలపై కూర్చుని అన్నం పొట్లాలు విప్పి తినడం మొదలుపెట్టారు.

''చూడు చూడు. ఆవుల మందల్లా ఎట్లా మెరిసిపోతున్నారో,'' అని కేక వేసింది మువ్వ.

వాళ్లను చూస్తేనే నా శరీరంపై ఏదో మొలుచు కొస్తున్న స్పర్శ.

హోర్డింగ్ పై నుంచి, 'జీవితం నిత్యమూ, నిరం తరమూ,' అనే అక్షరాలు మిలమిలా మెరుస్తున్నాయి.

*ఇండియా టుడే, 17 డిసెంబర్ 2002*

